క్లుప్తంగా

ఎలిగండ్లలో గ్రామసభ

మరికల్: గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం అధికారులు గ్రామసభను నిర్వహించారు. సభ ప్రారంభం కాగానే ఫోరం లేకుండానే గ్రామసభ ఎలా నిర్వహిస్తారని అధికారులను నిలదీశారు. తిరిగి గంట సమయం తర్వాత గ్రామసభను ప్రారంభించారు. ఎంపీడీఓ కొండన్న, ఏంపీఓ పావని మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే గ్రామసభలో పలు అభివృద్ధి పథకలపై, సమస్యల పరిష్కారంపై తీర్మానం చేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగ్స్, నోట్‌బుక్స్ పంపిణీ

కృష్ణా: మండలంలోని చేగుంట ప్రాథమికోన్నత పాఠశాలలో 102 మంది విద్యార్థులకు బుధవారం బీజేపీ యువ నాయకుడు సంజు పాటిల్ స్కూల్ బ్యాగ్స్, షూస్, సాక్స్, పెన్నులు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. భవిష్యత్‌లో ఇంకా ఈ విద్యార్థుల అభివృద్ధికి అవసరమయ్యే సహాయ సమకారాలు అందిస్తానని అన్నారు. అనంతరం ఉపాధ్యాయులు సంజుపాటిల్‌ను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు బస్వరాజ్‌గౌడ్, హంపన్నగౌడ్, ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, ఉపాధ్యాయులు సోమనాథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మరికల్: మండలంలోని ఎలిగండ్ల మన్నే వాగులో రాత్రి సమయంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను మరికల్ పోలీసులు మంగళవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. ఎలిగండ్లకు చెందిన వెంకట్రాములుగౌడ్, బీమన్నగౌడ్, రాకొండకు చెందిన బాలు, మరికల్‌కు చెందిన ఆంజనేయులు ట్రాక్టర్లు ఎలిగండ్ల మన్నేవాగులో నుంచి అక్రమంగా ఇసుకను ట్రాక్టర్లకు నింపుతుండగా వాటిని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మరికల్‌లో మరికొందరు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లపై కూడా నిఘా పెట్టడం జరిగిందని ఏఎస్‌ఐ ఎల్లయ్య తెలిపారు. పట్టుబడ్డ ట్రాక్టర్లపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

ఘనంగా ఎల్లమ్మ దేవర బండారు ఉత్సవాలు

నర్వ: మండలంలోని ఉందేకోడ్‌లో వాల్మీకి బోయలు ఎల్లమ్మ దేవర బండారు ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు విచ్చేసిన ప్రజాప్రతినిధులు, నాయకులను ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కురుమయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, బీసం చెన్నయ్యసాగర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శరణప్ప, వివేక్‌వర్ధన్‌రెడ్డి, రవిసాగర్ ఉన్నారు.

మరికల్ ఎస్‌ఐగా రాము

మరికల్: మండల నూతన ఎస్‌ఐగా ఎం. రాము బుధవారం బాధ్యతలు చేపట్టారు. నాగర్‌కర్నూల్ వీఆర్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ రాము మరికల్‌కు బదిలీ కావడం జరిగింది. మరికల్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ మురళి నారాయణపేట వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నారాయణపేట ఎస్పీ యోగేష్‌గౌతమ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని కొత్త ఎస్‌ఐకి ఎస్పీ సూచించారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు

కొత్తపల్లి: మండలంలోని అల్లీపూర్ గ్రామ పంచాయతీలో బుధవారం బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రేపు దేవతా మూర్తి విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుందని ప్రధాన పూజారులు గురువయ్య తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమేశ్ రెడ్డి, లైన్‌మెన్ రాములు, శ్రీనివాస్ రెడ్డి, దేవర వెంకటయ్య, వెంకట్ రాం రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వరికోత మిషన్‌లో పడి రైతుకు గాయాలు

గండేడ్: వరికోత కోస్తున్న మిషన్‌కు బెల్టుపడిపోవడంతో సరి చేయడానికి వెళ్లిన రైతు చేయి అందులోపడి విరిగిపోయి ఆస్పత్రిపాలయ్యాడు. వివరాల్లోకి వెళితే మండలంలోని చెన్నాయపల్లి గ్రామానికి చెందిన డీ. చెన్నారెడ్డి బుధవారం మధ్యాహ్నం వరికోత కోసేందుకు మిషన్‌ను పిలిపించాడు. కోతకోస్తున్న సమయంలో మిషన్ బెల్టు ఊడిపోయింది. దీంతో సరిచేయడానికి వెళ్లిన చెన్నారెడ్డి చేయి ప్రమాదవశాత్తు అందులో ఇరుక్కుని చేయి విరిగిపోయి తృటిలో ప్రాణాపాయం తప్పింది. తీవ్ర గాయాలపాలైన ఆయనను వెంటనే 108లో మహబూబ్‌నగర్ ఎస్వీఎస్ ఆస్పత్రికి తరలించారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



లావణ్యను సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

- ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. వాలీబాల్ లో నేషనల్‌కు సెలెక్ట్ అయిన గుండుమల్ జెడ్పీహెచ్ఎస్ 7వ తరగతి విద్యార్థిని లావణ్య, వాలీబాల్ కోచ్ ఎండీ సాదిక్‌లు బుధవారం ఎస్పీ యోగేష్ గౌతమ్‌ను ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మెదక్‌లోని చేగుంటలో రాష్ట్రస్థాయి సీఎంకప్ పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయిలో 7తేదీ నుంచి 16 తేదీ వరకు ఉత్తరప్రదేశ్ లోని వారణాసిలో జాతీయ స్థాయిలో పాల్గొంటుందని ఎస్పీకి వివరించారు. విద్యార్థినిని ఎస్పీ అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి జాతీయస్థాయిలో గెలవాలని కోరారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులకు స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయని తెలిపారు.

కోస్గి రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని నారాయణపేట ఎస్పీ యోగేష్‌గౌతమ్ అన్నారు. తన కార్యాలయంలో అండర్-14 వాలీబాల్‌లో జాతీయ స్థాయికి ఎంపికైన గుండుమాల్ గ్రామానికి చెందిన లావణ్యను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని, క్రీడా కోటలో ఉద్యోగాలు వస్తాయన్నారు. ఎకె స్పోర్ట్స్ అకాడమీ కోచ్ మాట్లాడుతూ మెదక్‌లోని చేగుంటలో రాష్ట్రస్థాయి అండర్-14 వాలీబాల్ పోటీలలో గెలుపొంది జాతీయ స్థాయికి ఎంపికకైందన్నారు. ఈ నెల 7 నుంచి 16 వరకు ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో జరిగే జాతీయ స్థాయిలో పాల్గొంటుందన్నారు. ఇందులో కోచ్ సాధిక్, నాగేష్ పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా మధుసూదన్‌రెడ్డి



కోట్ల మధుసూదన్‌రెడ్డి

నారాయణపేట: యువజన కాంగ్రెస్ ఎన్నికల ఫలితాలు బుధవారం విడుదల కావడంతో నారాయణపేట జిల్లా అధ్యక్షుడిగా జాజాపూర్‌కు చెందిన కోట్ల మధుసూదన్‌రెడ్డి 5,511 ఓట్లతో విజయం సాధించారు. ఆయనతో పాటు పోటీ పడిన నారాయణపేట కుర్వ మనోజ్‌కుమార్‌కు 3,841 ఓట్లు, విజయ్‌కుమార్ 86, వినోద్‌కుమార్ 157, మోహన్ 139 ఓట్లు వచ్చాయి. నారాయణపేట నియోజకవర్గ అధ్యక్షుడిగా కోయిల్‌కొండకు చెందిన హరీశ్వర్‌రెడ్డి, మండలాల యువజన అధ్యక్షులు నారాయణపేటకు తారక్, దామరగిద్దకు శ్రీను, ధన్వాడకు రాజు మరికల్‌లో ఆంజనేయులు విజయం సాధించారు.

మరికల్‌లో..

మరికల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆంజనేయులు ఎన్నిక కావడంతో కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా అంజి రెడ్డి ఎన్నిక కావడంతో ఇద్దరికి కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించి స్వీట్లను పంపిణీ చేశారు.

ఆదర్శ ప్రాయుడు ఘంటసాల



నారాయణపేట రూరల్: నేటి కళాకారులకు ఆదర్శ ప్రాయుడు ఘంటసాల అని ఎస్పీ బాలు అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం బాలకేంద్రంలో ఘంటసాల 103వ జయంతి వేడుకల సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం చిన్నారులకు మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంగ నర్సింహులు, వసంత్ కుమార్, జ్ఞానామృత పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుకు దూరం కాకూడదు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ నర్సింహులు

మాగనూర్: ప్రతి ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదని బడీడు పిల్లలందరూ బడిలో ఉండేలా చూసే బాధ్యత మనందరిదని చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ నర్సింహులు అన్నారు. బుధవారం మాగనూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలను ఉద్దేశించి పిల్లలకు స్వేచ్ఛ, అభివృద్ధి అని బాలల హక్కుల సంరక్షణార్థం నారాయణపేట జిల్లాలో బాలల రక్షక్ భవన్ ఉందన్నారు. లీగల్ అధికారి కవిత మాట్లాడుతూ లవ్ అండ్ అట్రాక్షన్‌కు లోను కాకూడదని, దీనివల్ల జీవిత అంధకారంలోకి వెళ్తుందన్నారు. ఆర్ఫన్ పిల్లలు 11 మంది, సెమీ ఆర్ఫన్ పిల్లలు 59 మంది ఉన్నట్లుగా ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కళావతి, వెంకట్‌రాములు, సంధ్య, స్పందన, విజయలక్ష్మి, చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ నర్సింహులు, లీగల్ అధికారి కవిత పాల్గొన్నారు.

జర్నలిస్టుల హక్కులసాధన కోసం పాటుపడుదాం



మక్తల్: జర్నలిస్టుల హక్కుల సాధన కోసం పాటుపడదామని రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్ అన్నారు. బుధవారం మక్తల్‌లో ఎంపీడీఓ కార్యాలయంలో టీయూడబ్ల్యూజేసీఐజేయూ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టు కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి శివకుమార్, ఉపాధ్యక్షుడు గురుప్రసాద్, ప్రహ్లాద్‌రెడ్డి కార్యవర్గ సభ్యులు రఘు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి



పగిడిమారి పాఠశాలను తనిఖీ చేస్తున్న జిల్లా విద్యాధికారి గోవిందరాజులు

ఊట్కూరు: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం గోవిందరాజులు అన్నారు. బుధవారం మండలంలోని పగిడిమారి పాఠశాలను తనిఖీ చేశారు. తరగతి గదుల్లో విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. మండలంలోని అన్ని పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు చొరవ తీసుకొని హాజరుశాతాన్ని పెంచాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయురాలు సునిత పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మయోజన శిక్షణకు లబ్ధిదారులు

దామరగిద్ద: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకంలో దరఖాస్తు చేసుకున్న అన్నసాగర్ గ్రామానికి చెందిన అర్హులైన లబ్ధిదారులకు సర్టిఫికెట్లు మంజూరయ్యాయి. బుధవారం మెన్స్‌రైట్ అసోషియోషన్ పౌండర్ మోహన్‌రాజ్ సమక్షంలో సర్టిఫికెట్లు అందజేశారు. చెప్పుల తయారీ, కుమ్మరి, వడ్డెర తదితర వృత్తిదారులు శిక్షణ కోసం ఎంపికైనట్లు తెలిపారు. శిక్షణ అనంతరం బ్యాంకు ద్వారా ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు రుణాలు పొందే అవకాశం ఉంటుందని వారు తెలిపారు.

రవాణా సమస్యలను పరిష్కరించాలి



నారాయణపేట ఆర్టీసీ బస్టాండ్ లో ధర్నా చేస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్/మక్తల్: ప్రజా రవాణా వ్యవస్థలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యు రాష్ట్ర సహకార్యదర్శి జయలక్ష్మి మాట్లాడారు. మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత ప్రయాణాన్ని కల్పించిన అందుకు తగినట్లు ఆర్టీసీ బస్సులను పెంచకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కాశీనాథ్, నారాయణ, నరసింహ, సునీత, సాయి, సలీం, ప్రసాద్, బాలు పాల్గొన్నారు.

– మక్తల్‌లో బస్సులను పెంచాలని డిమాండ్ చేస్తూ బస్టాండ్ దగ్గర ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిన 3వేల బస్సులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రవాణా సౌకర్యాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు భగవంతు, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఏజీ భుట్టో, శారద, భాస్కర్, వెంకటేష్, రాజు, రమాదేవి, నాగరాజు, గణేష్, రమేష్, రాములమ్మ పాల్గొన్నారు.

కేజీబీవీల్లో ఇద్దరు కొత్త టీచర్లు

నారాయణపేట రూరల్: జిల్లాలోని రెండు కేజీబీవీల్లో ఇద్దరు కొత్త టీచర్లకు బుధవారం నియామక ఉత్తర్వులు అందించారు. మక్తల్ కేజీబీవీలో తెలుగు సీఆర్‌టీ, నర్వ కేజీబీవీలో పీఈటీ పోస్టుల్లో పనిచేస్తున్న వారు ఇటీవల జరిగిన డీఎస్సీ 2024లో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడంతో వారు కేజీబీవీలకు రాజీనామా చేసి కొలువులో చేరారు. ఆయా స్థానాల్లో గతంలో నిర్వహించిన పరీక్షలో తదుపరి టాపర్లుగా ఉన్న వారికి డీఈఓ గోవిందరాజులు నియామకం చేసి పత్రాలను అందించారు. కార్యక్రమంలో జీసీడీఓ పద్మనళిని పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల గారడీ పోస్టర్ విడుదల



దామరగిద్దలో వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న బీజేపీ నాయకులు

దామరగిద్ద: అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల గారడీ భస్మాసుర హస్తంగా మారిందని బీజేపీ మండల అధ్యక్షుడు సత్తి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి ఎస్. గోపాల్ రావులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఊరడమ్మ దేవాలయ ఆవరణలో బీజేపీ విడుదల చేసిన ఆరు గ్యారంటీల గారడీ వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతినెల మహిళలకు రూ. 2500లు, 18ఏళ్ల నిండిన మహిళలకు ఉచిత స్కూటీ, కల్యాణ లక్ష్మీపథకం తులం బంగారం, రైతుభరోసా, రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్ళు, రూ.500లకే గ్యాస్ సిలిండర్ హామీలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ మోస పూరిత పాలనను ప్రజలకు తెలియజేసేందుకు శనివారం మండల కేంద్రంలోని బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

పశు వైద్యశిబిరం

నారాయణపేట రూరల్: మండలంలోని ఎక్లాస్‌పూర్‌లో బుధవారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరం విజయవంతమైంది. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఆవులు, గేదెలు రోగాల బారిన పడకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్య బృందం అనిరుద్ ఆచార్య, శ్రీనివాస్, మహదేవ్, గోపాలమిత్రలు ఉత్తేజ్, మాసప్ప, సతీష్, బిక్యానాయక్ పాల్గొన్నారు.

నర్వలో ఐఐటీ డిజిటల్ ట్యాబ్ పరీక్ష



నర్వ ప్రతిభా హైస్కూల్‌లో డిజిటల్ ట్యాబ్ ఐఐటీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నర్వ: జిల్లాలోనే మొట్టమొదటి సారిగా నర్వ ప్రతిభా హైస్కూల్‌లో ఐఐటీ డిజిటల్ ట్యాబ్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 6వ, తరగతి నుంచి 9వ, తరగతి విద్యార్థులకు ఐఐటీ ఫౌండేషన్ ద్వారా నిర్వహించే డిజిటల్ ట్యాబ్ పరీక్షలో గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పరీక్షలు రాసినట్లు కోఆర్డినేటర్స్ నరేష్‌కుమార్, శ్రావణ్‌కుమార్‌లు తెలిపారు. పరీక్షలను పాఠశాల ప్రిన్సిపల్ శ్రీజేష్‌లు పర్యవేక్షించారు.

ఆశా కార్యకర్తలకు రూ.18 వేల వేతనం ఇవ్వాలి

నారాయణపేట టౌన్: ఆశా కార్యకర్తలకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాలమణి, సీఐటీయూ జిల్లా నాయకులు బలరామ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆశా కార్యకర్తలు నారాయణ పేట పట్టణ మున్సిపల్ పార్కు ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వెంకట్రామ్‌రెడ్డి, పలు మండలాల ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



రాంగ్ పార్కింగ్ చేసిన వాహనాలకు జరిమానా విధిస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు

నారాయణపేట: ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో బుధవారం ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనాలపై, షాపుల ముందు రాంగ్ పార్కింగ్ చేసిన వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 86 ఈ చాలన్స్ నమోదు చేసి రూ.36 వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో రహదారులపై షాపుల ముందు రోడ్లపై వాహనాలు నిల్పరాదని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని షాపుల యజమానులకు సూచించారు. చిన్న పిల్లలకు, మైనర్లకు వాహనాలు ఇస్తే వాళ్ల తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ 2 కృష్ణ దేవ్, మహిళా ట్రెయినీ ఎస్‌ఐ రేవతి పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

కోస్గి రూరల్: నింబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్‌ఐ బాల్‌రాజ్ అన్నారు. పట్టణంలోని శివాజీ చౌరస్తాలో నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టామన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు తప్పని సరిగా హెల్మెట్ వాడాలని, లైసెన్స్ ఉండాలన్నారు. సుమారు 40 వాహనాలను గుర్తించి స్టేషన్‌కు తరలించి జరిమానా విధించామన్నారు. కొత్త నెంబరు ప్లేట్లు బిగించాక వాహనాలను ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ -2 శ్యాంసుందర్, ట్రెయినీ ఎస్‌ఐ మహేశ్వరి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా చెకుముకి సంబరాలు



టాలెంట్ టెస్ట్ పత్రాలను విడుదల చేస్తున్న డీఈఓ గోవిందరాజులు

నారాయణపేట రూరల్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ గ్రౌండ్ ఉన్నత పాఠశాలలో జిల్లాలోని అన్ని మండల టాపర్లకు ట్రీస్ పోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీఈఓ గోవింద రాజులు హాజరై టాలెంట్ టెస్ట్ పేపర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించాలని, సృజనాత్మకతను వెలికి తీసి శాస్త్రీయ ఆలోచనలను రేకెత్తించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సెక్రటరీ నరహరి, ప్రధానోపాధ్యాయులు దత్తు రావు, ఉపాధ్యాయ సంఘం నాయకులు భీమయ్య, పవన్, భాను ప్రసాద్, కవిత, శ్రావణి, మహేశ్వరి, అరుణ పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు అంచనా వేయాలి



శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న జిల్లా మానిటరింగ్ అధికారి విద్యాసాగర్

మరికల్: ప్రభుత్వ పాఠశాల్లో చదివే విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు, విద్యా ప్రమాణాలను అంచనా వేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి విద్యాసాగర్ అన్నారు. మరికల్ బాలుర ఉన్నత పాఠశాల్లో బుధవారం 3,6,9 తరగతులకు మూడేళ్ల ఒకసారి దేశవ్యాప్తంగా నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో ఎంఈఓ మనోరంజిని, కాంప్లెక్స్ హెచ్‌ఎం నాగరత్నమ్మ, సీఆర్పీ శివకుమార్‌లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన బియ్యం పరిశీలన

మరికల్: మండలంలోని చిత్తనూర్ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం బియ్యాన్ని బుధవారం తహసీల్దార్ జమీల్, ఆర్‌ఐ సుధాకార్‌రెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చేసే భోజనం విషయంలో నిర్వాహకులు రాజీ పడకుండా నాణ్యతతో చేయాలని తెలిపారు. పురుగుల అన్నం రాకుండా జాగ్రతలు తీసుకోవాలని సూచించారు.

అలరించిన సాంస్కృతిక సారథి కళాబృందం

దామరగిద్ద: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మండలంలోని బాపన్‌పల్లి, మొగుల్‌మడ్క, మద్దెల్‌బీడ్ గ్రామాల్లో సాంస్కృతిక కళాసారథి కళాబృందం నిర్వహించిన ఆటపాటలు గ్రామీణ ప్రజలను అలరించాయి. రాష్ట్ర ప్రభుత్వం గతేడాది కాలంలో చేపట్టిన ప్రజా సంక్షేమాభివృద్ధి పథకాలను ఆట పాటల ద్వారా వివరించారు. పంచాయతీ కార్యదర్శులు, మాజీ ప్రజా ప్రతినిధులు, సాంస్కృతిక సారథి కళాకారులు రవిశంకర్, కిరణ్, సరసింహ, బాలయ్య, లక్ష్మి, అరుణ, జ్యోతి పాల్గొన్నారు.

ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌పై కేసు తగదు



మాట్లాడుతున్న ఆర్ఎస్పీ టీం ఇన్‌చార్జి అశోక్

దామరగిద్ద: గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై పోరాటం చేసేందుకు గురుకులబాట కార్యక్రమాన్ని చేపట్టిన ఆర్ఎస్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై ప్రభుత్వం కుట్రపూరితంగా కేసు నమోదు చేయడం సరికాదని ఆర్ఎస్పీ టీం జిల్లా ఇన్‌చార్జి అశోక్ కుమార్ అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురుకుల సెక్రటరీగా గురుకులాలను తీర్చిదిద్దిన అనుభవంతో పాఠశాల ల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు సిద్ధమయ్యాడన్నారు. వెంటనే ఆయన పై పెట్టిన కేసును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీం సభ్యులు లాలప్ప, గజలప్ప, మహేష్, నవీన్ పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయ 8వ వార్షికోత్సవం



కొల్లంపల్లిలో అభిషేకం చేస్తున్న అయ్యప్పస్వాములు



మక్తల్‌లో అయ్యప్పస్వామి ఆలయంలో మొక్కులు తీర్చుకుంటున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: మక్తల్ పట్టణంలో అయ్యప్పస్వామి ఆలయ 8 వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం మక్తల్ దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి స్వామివారికి పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చంద్రకాంత్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, అశోక్‌గౌడ్, అనిల్ గురుస్వామి, గణేష్‌కుమార్, రాజేందర్ పాల్గొన్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ

కోస్గి: పట్టణంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర శివసాయి అయ్యప్ప ఆలయాలలోని అయ్యప్ప దేవాలయంలో అయ్యప్ప మహా పడిపూజ సందర్భంగా పట్టణంలో అయ్యప్ప నామస్మరణ మార్మోగింది. అయ్యప్ప మాలధారణ స్వాములు మహాపడి పూజను రెండు రోజులుగా వేడుకగా నిర్వహిస్తున్నారు. కర్లికోట ఆంజనేయస్వామి ఆలయం నుంచి అయ్యప్ప దేవాలయం వరకు పూర్ణ, పుష్కల సహిత అయ్యప్ప కలశ ఊరేగింపు అయ్యప్ప ఆలయం వరకు నిర్వహించారు. మహా మంగళ హారతి, భక్తి పాటలతో పూజలు చేశారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

నారాయణపేట రూరల్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్కుమార్ సూచించారు. మండలంలోని కొల్లంపల్లి గ్రామంలో అయ్యప్పస్వామి 18 మెట్ల మహాపడిపూజ బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దేవేందర్‌గౌడ్, ఫౌండేషన్ సభ్యులు తిప్పన్న, గోపాల్, కృష్ణ, సుదర్శన్ రెడ్డి, వెంకటేష్, శివరాజ్, శ్రీనివాస్, నర్సింహ, సంతోష్ పాల్గొన్నారు.

కొల్లంపల్లి విద్యార్థినికి అథ్లెటిక్స్‌లో సిల్వర్ మెడల్



కొల్లంపల్లిలో విద్యార్థిని అభినందిస్తున్న జీహెచ్‌ఎం అనురాధ

నారాయణపేట రూరల్: మండలంలోని కొల్లంపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ సాధించింది. డిసెంబర్ 1న మంచిర్యాల జిల్లాలో జరిగిన 10వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో కొల్లంపల్లి పాఠశాల విద్యార్థులు మౌనిక, రవితేజ పాల్గొన్నారు. ఈ పోటీలలో మౌనిక రాష్ట్ర స్థాయిలో సిల్వర్ మెడల్ సాధించినట్లు జీహెచ్‌ఎం అనురాధ, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీధర్‌గౌడ్ తెలిపారు. విద్యార్థినిని బుధవారం పాఠశాల ఆవరణలో గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, రవి, కవిత, ఫర్జానా బేగం, నరేష్ , రాములు, వనిత పాల్గొన్నారు.